క్లుప్తంగా

రేపు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం

మండపేట: స్థానిక మండపేట రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో డీఆర్ వివరాలు, ఇన్‌కంట్యాక్స్, ఈకేవైసీ, లైఫ్‌సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

నేత్ర దానం


రామలక్ష్మి

కె.గంగవరం: పామర్రు గ్రామానికి చెందిన కోడూరి రామలక్ష్మి (83) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడంతో కాకినాడకు చెందిన ఐ బ్యాంక్ సిబ్బంది వారి ఇంటికి చేరుకుని కార్నియాను సేకరించారు. రామలక్ష్మి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

యండగండిలో నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కె.గంగవరం: యండగండి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట: బొమ్మూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. ఏడిద, మండపేట, గొల్లపుంత, తాపేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రతి ప్రాంతం త్యాగభరితం


కపిలేశ్వరపురంలో మట్టిని అమర్చిన కలశాన్ని అందుకుంటున్న ఎంపీపీ

కపిలేశ్వరపురం: భారతదేశంలో ప్రతి ప్రాంతం త్యాగభరితమైందని, దేశ స్వాతంత్ర్య యోధుల స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలని మన దేశం–మన మట్టి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా గురువారం కపిలేశ్వరపురంలో ర్యాలీ నిర్వహించారు. గత కొద్ది రోజులుగా గ్రామస్థాయిలో సేకరించిన మట్టి, వ్యవసాయ ఉత్పత్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కలశంలో అమర్చారు. మండలం తరపున ఢిల్లీ కార్యక్రమానికి హాజరయ్యే ఉద్యోగ ప్రతినిధులకు అందజేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ప్రసంగించారు. చిన్నారులు భరతమాత, జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు.

తపాలా ప్రమాద బీమా సదుపాయం

మండపేట: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా కేవలం రూ.399లకే పోస్టల్ శాఖ అందిస్తున్న రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని ప్రజలకు అందించేందుకు శుక్రవారం మండపేటలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్టు పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ తెలిపారు. స్థానిక నారాయణరెడ్డి హాస్పటల్ ఎదురుగా ఉన్న మోటారు మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద మండపేట పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన శిబిరం పాక్షిక అంగవైకల్యం, పక్షవాతం వచ్చిన బీమా వర్తిస్తుందన్నారు. పాలసీ తీసుకునేందుకు 18 సంవత్సరాల నుంచి 65 ఏళ్లమధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాలసీ కోసం ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డ్, మొబైల్ ఫోన్ తీసుకురావాలని సూర్యనారాయణ కోరారు.

పోస్టుకార్డు ఉద్యమం

మండపేట: సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం తీసుకురావాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్టు జిల్లా సీపీఎస్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం రాత్రి రామచంద్రపురం డివిజన్ మండలాల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. సంఘ నాయకులు ఆర్ శ్రీనివాస్, జి.రాజు, కె.గోపాలకృష్ణారెడ్డి, పి.సురేంద్రకుమార్, ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- వందలాది మందికి వైద్య సేవలు

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 533 మందికి వైద్య సేవలు అందించారు. సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు చిక్కాల స్వామికాపు, మంచెం దేవి, స్థానిక పెద్దలు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ సందీప్ నాయుడు, డాక్టర్ మమత, స్పెషలిస్టు డాక్టర్లు పేథాలజిస్ట్ డాక్టర్ సునీత, ఆర్థోపెడిక్ డాక్టర్ ఎస్ఆర్‌సీ మూర్తి, హోమియో వైద్యాధికారి డాక్టర్ ప్రతిభ, ఆప్తమాలిక్ నిపుణులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, కాపవరం ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఈఓ పీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు పంతగడ విజయప్రసాద్, తోట వీరభద్రరావు, పెద్దిరెడ్డి రాంబాబు, పెద్దిరెడ్డి స్వామి, అన్యం వీరబాబు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


వెల్ల గ్రామస్తులకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా

కె.గంగవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కోటిపల్లి సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దనే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి, పూర్తి స్థాయిలో వైద్యులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచుతోందని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు కూడా ఉచితంగా అందిస్తోందని అన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), సర్పంచ్ పెమ్మాడి బేబీ, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, కన్వీనర్ దంగేటి వీరబ్రహ్మం, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


కోటిపల్లి శిబిరం వద్ద మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

564 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: టేకిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వివిధ విభాగాల నిపుణులు 564 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను చేశారు. శిబిరంలో సేవలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.చంద్రమౌళి, సీహెచ్.రాకేష్ కృష్ణ చౌదరి పర్యవేక్షించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి, ఎంపీఈఓ పీడీడీ బిషప్, ఎంపీహెచ్ఎస్ వీఎస్ కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


టేకి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అబ్బు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజుబాబు

క్రీడాకారులకు అభినందనలు

మండపేట: ఇటీవల సౌత్ఆఫ్రికాలో జరిగిన అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో భారత్‌కు చాంపియన్‌షిప్‌ను సాధించిన జాతీయ జట్టులోని మండపేట క్రీడాకారులు వడ్డాది వినయ్, పిల్లి రామారావు, కోచ్ కుంచే రమేష్‌లను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఇరువురు ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. దేశానికి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పథకాలు గెలుచుకోవడంతో వారిని ఎమ్మెల్సీ తోట ప్రశంసించారు. అంతర్జాతీయస్థాయిలో రాణించి మండపేటకు మంచి గుర్తింపు తెచ్చారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్సీ తోట ఆకాంక్షించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్ అభినందించారు.

సీఎం జగన్ పథకాలు దేశానికే ఆదర్శం


సంక్షేమ పథకాల లబ్ధిని స్థానిక మహిళకు వివరిస్తున్న మంత్రి వేణు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- కుయ్యేరు గడప గడపకూ మన ప్రభుత్వం

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పెదలంకలో తనయుడు నరేన్‌తో కలిసి ఆయన గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రతి ఒక్కరికీ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూరు శాతం అమలు చేయడంతో పాటు ప్రజావసరాలకు అనుగుణంగా ఎన్నికల వేళ ప్రకటించని పథకాలను కూడా అమలు చేస్తున్నారని అన్నారు. దేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వివిధ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ సగటున రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ లబ్ధి చేకూరుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలు అందుకుంటారని మంత్రి వేణు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి చంటి, పీఏసీఎస్ చైర్మన్ తొగరు శేఖర్‌బాబు, ఎంపీటీసీ సభ్యురాలు పంపన పద్మావతి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యాళ్ళ సత్తిబాబు, దంగేటి అరుణ్‌కుమార్, ఉప్పుమిల్లి సర్పంచ్ పెంకే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అర్తమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

మండపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఆయన అర్తమూరులోని కొత్తపేట, రామవరం రోడ్డు, ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ అనిల్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్ ప్రజల వద్దకే పథకాలను చేరవేస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కాని పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా వలంటీర్లు తలుపుతట్టి మరీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, పార్టీ నేతలు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, మేకా శ్రీనివాస్, పెందుర్తి సంపత్, గుమ్మడి అనిల్, కొల్లి వెంకటలక్ష్మి, నందికోళ్ల ప్రసాద్, ఉల్లిపాటి అంజి, వెలగల శివారెడ్డి, కల్లెం వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- రూ.1.50 కోట్లతో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన

కాజులూరు: గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కోలంకలో రూ.1.50 కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్ ద్వారా ధవళేశ్వరం నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలను గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకు, అక్కడి నుంచి కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ సరఫరా చేస్తామని వివరించారు. ఇప్పటికే జల్‌జీవన్ మిషన్ ద్వారా 27.33 కోట్లతో మండలంలో 30 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని, మిగిలిన వాటి నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేసి ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, ఎంపీపీ మాత భారతీ మురళి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ తొగరు శేఖర్‌బాబు, ఎంపీటీసీ సభ్యురాలు పంపన పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


కోలంకలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు మండపేట విద్యార్థులు

మండపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్–19 ఆటల పోటీల్లో స్థానిక ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి, పీఈటీ ఈవీవీ సత్యనారాయణ తెలిపారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, రగ్బీ పోటీలకు పి.పరంజ్యోతి, హ్యాండ్ బాల్‌కు సీహెచ్ కార్తిక్, ఎస్.మహేంద్ర, బాస్కెట్‌బాల్‌కు పి.సత్యనారాయణ, టెన్నికాయిట్‌కు జి.సంతోష్, విసాయిరాం, రిబ్కా, గాయత్రి, చెస్‌కు దేవకీ కల్యాణి, ఎ. నవ్య, బాల్‌బాడ్మింటన్‌కు షేక్ అబ్దుల్ రహీం, షేక్ ఖాజా బాబా, రమ్య రేణుక, జనని, షటిల్ బ్యాడ్మింటన్‌కు బి.హావిలా జాయ్స్ ఎంపికయ్యారన్నారు. వీరిని గురువారం కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగుళ్ల చైతన్య బాబు, అధ్యాపకులు సూర్యనారాయణ రెడ్డి, సమర్పణకుమార్, లైబ్రేరియన్ సువర్ణ కుమార్ తదితరులు అభినందించారు.

లక్ష్యంతో సాధన చేస్తేనే విజయాలు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట రమణ

రామచంద్రపురం: జీవితంలో ప్రతి ఒక్కరూ సమాజంపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని సాధన చేస్తేనే విజయం సాధించగలరని కాకినాడకు చెందిన రేడియాలజిస్ట్ డాక్టర్ కాదా వెంకట రమణ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన »ఆరోగ్యం – సంతోషం – జీవిత లక్ష్యం« అనే అంశాలపై కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో సంతోషకరమైన జీవితాన్ని అనుభవించాలంటే ప్రతి ఒక్కరూ చదువు అనే ఆయుధంతో ముందుకు సాగాలని అన్నారు. వయస్సు రీత్యా మనస్సులో కలిగే భావనలను అదుపులో ఉంచుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత మాట్లాడుతూ, జీవితంలో స్థిరపడకుండా తొందరపడి వివాహాలు చేసుకుంటే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. వ్యక్తిత్వ, సామాజిక, మానసిక వికాస నిపుణుడు అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవీఆర్ ఫణీంద్ర మాట్లాడుతూ, విద్యార్థులు స్థానిక, సామాజిక, వర్తమాన అంశాలతో పాటు పరిష్కారంపై విశ్లేషించుకుంటే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు.

పోరాట యోధుడు ‘తోరాటి’

- 23 ఏళ్ల వయస్సులో వీరమరణం
- తెలంగాణ రైతాంగ పోరాటంలోని పోలీసుల కాల్పుల్లో మృతి
- నేడు లక్ష్మణమూర్తి 97వ జయంతి


తోరాటి లక్ష్మణమూర్తి

కపిలేశ్వరపురం: సామాన్యుల సమస్యల పరిష్కారానికి వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేసిన వారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి ఒకరు. ధనిక కుటుంబంలో జన్మించినా సుఖసంతోషాలను పక్కన పెట్టి పేదల కష్టాలు తీర్చేందుకు జీవితాంతం కృషి చేశాడు. చివరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోలీసుల తూటాలకు అమరుడయ్యాడు. ఏళ్లు గడచినా అంగర గ్రామస్తులు ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూంటారు. నేడు తోరాటి లక్ష్మణమూర్తి 97వ జయంతి సందర్భంగా ఈ కథనం..

ప్రజా సమస్యలపై పోరాటం

పేరు ప్రఖ్యాతులు, సిరి సంపదలున్న అంగర గ్రామానికి చెందిన తోరాటి వెంకటరెడ్డి, రావమ్మ దంపతులకు 1926 అక్టోబరు 13న లక్ష్మణమూర్తి జన్మించాడు. చిన్న వయస్సులోనే సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రజలను జాగృతం చేసేవాడు. రామచంద్రపురం పరిసర గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన జరిగిన భూ పోరాటాల్లో తోరాటి కీలకంగా వ్యవహరించారు. ఆయన కార్యకలాపాలను నిలువరించేందుకు అప్పట్లో అంగర ప్రధాన రహదారి పక్కన పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయగా తర్వాత కాలంలో అది కాస్తా పోలీసు స్టేషన్‌గా స్థిరపడింది. వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేశాడు. పోలీసులకు చిక్కకుండా తోరాటి తప్పించుకున్న ఘటనలను వీరగాధలుగా చెప్పుకునేవారు.

చారిత్రక సాయుధ పోరాటంలో వీరమరణం

పేద రైతులకు భూములు పంచాలంటూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం సాగింది. ఇందులో సమీప రాష్ట్రాల యువకులు పాల్గొనాలని పార్టీ పిలుపునివ్వడంతో అంగర నుంచి లక్ష్మణమూర్తి తెలంగాణకు వెళ్లి నాయకత్వం వహించారు. 1951 అక్టోబర్ 21న వికారాబాద్ ప్రాంతంలో రైతులనుద్దేశించి ప్రసంగిస్తుండగా పోలీసు కాల్పుల్లో వీరమరణం పొందాడు. భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేత, సాయుధ పోరాట రథసారథి పుచ్చలపల్లి సుందరయ్య తాను రాసిన ‘వీర తెలంగాణ విప్లవ పోరాటం – కొన్ని గుణపాఠాలు’ అనే గ్రంథంలో లక్ష్మణమూర్తి త్యాగం గురించి రాశారు. ఆ పార్టీ ఆలిండియా మహాసభ సావనీర్‌లో లక్ష్మణమూర్తి ఫొటో ముద్రించి, ఆయన త్యాగానికి నివాళులర్పించారు. లక్ష్మణమూర్తి జ్ఞాపకార్థం ఆయన సహచరుడు పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో గ్రామంలో తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్మించారు. లక్ష్మణమూర్తి నిలువెత్తు విగ్రహాన్ని అంగర గాంధీ సెంటర్‌లో ప్రతిష్టించారు. లక్ష్మణమూర్తి, మరికొందరు కమ్యూనిస్టు నాయకులకు నివాళిగా మండపేట కరాచీ సెంటర్ వద్ద స్మారక స్థూపం ఏర్పాటు చేశారు.

సీఎంను కలిసిన పాపారాయుడు


సామర్లకోటలో సీఎం జగన్‌ను కలిసిన పాపారాయుడు

మండపేట: సామర్లకోట జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాల వేడుకకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. కనివినీ ఎరుగుని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా 30.75 లక్షల మంది పేదల సొంతింటి కలను సాకారం చేస్తుండడంపై సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

సమాచార హక్కు సంఘం మండల అధ్యక్షుడిగా రమేష్‌బాబు



కె.గంగవరం: జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం మండల అధ్యక్షుడిగా కోట గ్రామస్తుడు ముంగి రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా రమేష్ బాబు గురువారం చెప్పారు.

ఘనంగా అమృత కలశ మహోత్సవం

రామచంద్రపురం రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా మన దేశం – మన మట్టి కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అమృత కలశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచీ కలశాల్లో మట్టి, ధాన్యం సేకరించి, జెడ్పీ కార్యాలయానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, సర్పంచ్ యనమదల వెంకట రమణ, డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఈఓ పీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు


తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న వీఆర్‌ఓలు

రామచంద్రపురం రూరల్: మండల తహసీల్దార్‌గా మైలా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న పి.తేజేశ్వరరావు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అడిషనల్ పీఎస్‌గా బాధ్యతలు తీసుకున్నారు. దీంతో ద్వారకా తిరుమలలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరరావుకు ప్రభుత్వం తహసీల్దార్‌గా పదోన్నతి కల్పించి, రామచంద్రపురంలో నియమించింది. ఆయనకు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కర్రి మహాలక్ష్మినాయుడు, ఆర్ఐ పెంకే మునీశ్వర్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, మండల ప్రెసిడెంట్ పంపన విష్ణుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.